

ఎంపీని కలిసిన సౌదీ బాధితులు

వజ్రపుకొత్తూరు : జీవనోపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి అక్కడ చిక్కుకున్న మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన బాధితులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంచినీళ్లపేటకు చెందిన పుక్కళ్ల రామ్మూర్తి, కె.నరసింహులు, గణేష్, బుంగ సంతోష్, ఆర్.దానయ్య, సోడిపిల్లి రాకీ, చెక్క ఎర్రన్న తదితర 20 మంది మత్స్యకారులు ఉపాధి కోసం సౌదీ వెళ్లి అక్కడ పనుల్లేక, స్వదేశానికి వచ్చే మార్గం లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని టిడిపి నాయకులు గోవింద పాపారావు, మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు ఎంపీ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ స్పందించి విదేశాంగ మంత్రిని కలిసి, బాధితులను స్వదేశానికి తీసుకురావడానికి చేసిన కృషి ఫలించడంతో క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నారు.

ఆద్యంతం అండగా...



మానవత్వం ఉన్న మనుషులు మన మధ్యనే ఉన్నారనడానికి ఈ చిన్నారి కష్టం ఉదంతమే ఓ ఉదాహరణ. నూటికో కోటికో కాదు... కష్టం ఉందని తెలిస్తే తల్లడిల్లిపోయి స్పందించే హృదయాలు ఎన్నో. తొలి అడుగు ఎప్పుడూ ఒంటరే. ఆ అడుగు నిజాయితీతో బలంగా పడితే మరెన్నో అడుగులు పడుతాయి. ఇంకెన్నో చేతులు కలుస్తాయి. ఆ తొలి అడుగు 'ప్రజాశక్తి' వేసింది. అరుదైన వ్యాధి బారిన పడిన తొమ్మిది నెలల చిన్నారి ఆద్య ఆరోగ్య, తల్లిదండ్రుల దయనీయ పరిస్థితిపై 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' శీర్షికన ప్రచురించిన కథనానికి దాతల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంతో కొంత కాదు... ఏకంగా చిన్నారి చికిత్సకు అవసరమయ్యే రూ.18 లక్షలు పది రోజుల్లోనే సమకూరాయి. చిన్నారి గుండెచప్పుడుకు ఆ మంచి మనసులు మేమున్నామంటూ అండగా నిలిచాయి.

- **చిన్నారి చికిత్సకు వెల్లివిరిసిన మానవత్వం**
- **పది రోజుల్లోనే చికిత్సకు అవసరమైన రూ.18 లక్షలు సేకరణ**
- **'ప్రజాశక్తి' కథనానికి అనూహ్య స్పందన**
- **కృతజ్ఞతలు తెలిపిన ఆద్య తల్లిదండ్రులు**

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన యాండ్రాపు చిరంజీవి, అంజలి దంపతుల తొమ్మిది నెలల కుమార్తె ఆద్య హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. జూలైలో ఆద్యకు జ్వరం రావడంతో సోంపేటలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఫలితం లేకపోవడంతో, శ్రీకాకుళంలోని మరో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో, ప్రస్తుతం విశాఖపట్నంలోని గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు పాప హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. చికిత్సకు రూ.18 లక్షల వరకు ఖర్చువుతుందని, చికిత్స కూడా మూడు వారాల్లోగా చేయాలని చెప్పారు. గ్రామ వాలంటీరుగా పనిచేస్తున్న ఆద్య తండ్రి చిరంజీవి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో, పాప ఆరోగ్య పరిస్థితిపై దాతల సాయం కోరుతూ ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై దాతృత్వం వెల్లివిరిసింది. చిన్నారి ఆద్య కోసం వేలాది హృదయాలు స్పందించాయి. దీంతో వైద్యం కోసం అవసరమైన రూ.18 లక్షలు కేవలం పది రోజుల్లోనే సమకూరినట్లు పాప తల్లిదండ్రులు తెలిపారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉందని, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే వరకు కొంతకాలం పాటు వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు చిరంజీవి తెలిపారు. ప్రస్తుతం పాపకు కీమోథెరపీ చికిత్స చేస్తున్నట్లు చెప్పారు.

అడుగు వెనుక మరో అడుగు

'చిన్ని గుండెకు పెద్ద కష్టం' శీర్షికన ఈనెల 15వ తేదీన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి దాతల నుంచి అనూహ్య స్పందన లభించింది. ముఖ్యంగా వార్త చూసిన వెంటనే ఇచ్ఛాపురం ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దలై స్పందించారు. రూ.రెండు వేలు అందించి ఈ బృహత్తర కార్యక్రమానికి పునాది వేస్తే, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పాపకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా గ్రామస్తులతో సమావేశమై పాప వైద్యం కోసం అవసరమైన నిధుల సేకరణ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. తన వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాల్లో పాప ఆరోగ్యం గురించి ప్రజాశక్తిలో వచ్చిన కథనాన్ని పోస్టు చేసి దాతల నుంచి సాయం కోరారు. గ్రామంలోని ప్రతి వ్యక్తి తనకు తోచిన సాయం చేయడమే కాకుండా వృత్తిరీత్యా బయట ఉన్న వారు కూడా స్పందించేలా అనుక్షణం పర్యవేక్షించారు. జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ నేరుగా ఆస్పత్రికి వెళ్లి పాప ఆరోగ్యం కోసం వైద్యులతో మాట్లాడారు.

తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి వారికి ఆర్థికసాయం అందించారు. మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్ ప్రజాశక్తిలో వచ్చిన కథనాన్ని పూర్తిస్థాయిలో ప్రచారం చేసి పాప చికిత్సకు నిధుల సేకరణలో భాగస్వాములయ్యారు. మండలంలోని అన్ని స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుని పాప వైద్యం కోసం పూర్తిస్థాయిలో సహకరించారు. జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు దాసరి రాజు జనసేన పార్టీ నుంచి పూర్తిస్థాయి సహకారం అందించారు. నియోజకవర్గంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, దయార్ద్ర హృదయాల గురించి ఎంత చెప్పినా తక్కువే. కేవలం పది రోజుల్లోనే పాప వైద్యం కోసం రూ.18 లక్షలు పోగయ్యాయంటే అందులో వీరి పాత్ర ఎనలేనిది.

కొంతమంది దాతలు వ్యక్తిగతంగా (బెందాళం శ్రీకాంత్ శ్రీనిధి గ్రూప్ ఆఫ్ కంపెనీ ద్వారా రూ.లక్ష, బల్లెడ విద్యాసాగర్ రూ.25వేలు, పాండవ రామారావు రూ.21 వేలు) పెద్ద మొత్తంలో సాయం అందిస్తే, మరికొంత మంది సమూహంగా ఏర్పడి (చిరంజీవి పదో తరగతి క్లాస్‌మేట్స్ రూ.78,801, ప్రగడపుట్టుగ యాదవ సంఘం తరుపున రూ.40,316, నేవీలో పనిచేస్తున్న పసుమతి నరేష్ తన స్నేహితులతో కలిసి రూ.40వేలు) పాప వైద్యం కోసం నిధులు సేకరించారు. కేవలం పది రోజుల్లోనే పాప వైద్యం కోసం అవసరమైన రూ.18 లక్షలు సేకరించడం వారి మంచి మనసులకు మచ్చుతునక.



పాప వైద్యం కోసం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ (ఫైల్)

జీవితాంతం రుణపడి ఉంటాం



మా పాప వైద్యం కోసం అవసరమైన డబ్బులు ఎలా సమకూర్చాలో తెలియని పరిస్థితిలో ఉన్నప్పుడు ఒక స్నేహితుని సూచన మేరకు ప్రజాశక్తిని సంప్రదించాను. పాప వైద్యం కోసం వార్త రాసి, ఇంతమంది హృదయాలను కదిలించిన ప్రజాశక్తి రుణం తీర్చుకోలేనిది. జీవితాంతం పత్రికకు రుణపడి ఉంటాం. పాప వైద్యం కోసం సాయం చేసిన ప్రతి దాతకు పేరుపేరునా పాదాభివందనాలు.

- యాండ్రాపు చిరంజీవి
చిన్నారి తండ్రి



చాపరలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘ నాయకులు

ఆదివాసీల సమస్యలపై ఐక్య పోరాటాలు

- **గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాంబాబు**
- **ఘనంగా గిరిజన సంఘ జిల్లా మహాసభలు**



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాంబాబు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం 8వ జిల్లా మహాసభలు మండలంలోని చాపరలో శుక్రవారం నిర్వహించారు. ప్రదర్శన అనంతరం గిరిజన సంఘం జెండాను సీనియర్ నాయకులు జన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఓట్ల కోసం అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చడం నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజనులను మోసం చేయడమేనన్నారు. గిరిజనుల సాగు భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని, జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సెప్టెంబర్ 18వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో సంఘ జిల్లా కార్యదర్శి సవర ధర్మారావు. బొంతు అప్పారావు. ఎస్.జోగేంద్ర, రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మణరావు. ఎల్లయ్య, సూరయ్య, కె.విమల తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభల్లో గిరిజన సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బొంతు అప్పారావు, కార్యదర్శిగా నిమ్మక అప్పన్న, ఉపాధ్యక్షులుగా ధర్మారావు, ఎస్.జోగేంద్ర, ఆదినారాయణ సహాయ కార్యదర్శులుగా ఎస్.ఫల్గుణరావు, రుషితో పాటు కమిటీ సభ్యులు మరో ఏడుగురిని ఎన్నుకున్నారు.



అప్పారావు, అప్పన్న

పిడుగు పడి అన్నదాత మృతి



రామస్వామి (ఫైల్)

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

పిడుగుపాటుకు గురై మండలంలోని వేల్పురాయికి చెందిన మహంతి రామస్వామి (63) శుక్రవారం మృతి చెందాడు. రామస్వామి రోజూలానే పొలం పనుల్లో నిమగ్నమయ్యాడు. కూలీలతో వరి ఉడిపిస్తుండగా భారీ వర్షం గర్జనలతో కురిసింది. సాగుకు ఈ వర్షం తోడైందనే సంతోషం ఆ మోములో విరిసీ విరిస్తుండగానే పిడుగు పడడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య కాంతమ్మ, కుమారుడు రమణ, కుమార్తెలు రామలక్ష్మి, మంగమ్మ ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుంటుంబసభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. జె.ఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరువుల అమ్మకాలపై ఇంటెలిజెన్సీ ఆరా

'ప్రజాశక్తి' కథనంపై వివరాల సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

ఎరువుల విక్రయాలపై ఇంటెలిజెన్సీ అధికారులు ఆరా తీశారు. ప్రజాశక్తి జిల్లా పేజీలో ఈనెల 25న 'మమ్మల్ని అడిగేదెవరు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్సీ అధికారులు శుక్రవారం వివరాలు సేకరిస్తున్నారు. ప్రత్యేకించి బూర్జ మండలంలో జరుగుతున్న విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. అధిక ధరలకు అమ్మడం, దుకాణాలకు అదనంగా సరుకు ఎలా వస్తోందన్న అంశాలను తెలుసుకున్నారు. మరోవైపు ఒకరిద్దరు డీలర్లు ప్రజాశక్తి విలేకరికి ఫోన్ చేసి బెదిరింపులకు సైతం పాల్పడ్డారు. ఇదిలా ఉండగా బూర్జ మండలంలో అనుమతుల్లేకుండా కొన్ని షాపుల్లో ఎరువులను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయశాఖ అధికారి బి.రాజేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం మండలంలో ఎనిమిది రిటైల్ షాపులు ఉండగా అందులో ఐదు దుకాణాల్లోనే వ్యాపారం నడుస్తోందని చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పది దుకాణాల్లో వ్యాపారం సాగుతోంది. బూర్జ మండలం కొల్లివలసలో ఐదు, గుత్తావిల్లి బూర్జ, వైకుంఠపురం, మదనాపురం, కురిమిపేటలో ఒక్కొక్కటి చొప్పున నడుస్తున్నాయి. వీటిలో ఏ దుకాణాలకు అనుమతులు ఉన్నాయో, వేటికి లేవో అధికారులు తనిఖీలు చేస్తే గానీ తెలిసే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ విక్రయాలు, అధిక ధరలు, నిల్వలపై తనిఖీలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేత్రదానంతో కంటిచూపు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

శ్రీకాకుళం అర్బన్ : కార్నియల్ అంధులకు నేత్రదానంతోనే కంటిచూపు స్యాధ్యమవుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా తన ఛాంబరులో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఈనెల 25వ తేదీ నుంచి సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకు జిల్లాలో నేత్రదానంపై ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అపోహలు వీడేందుకు నేత్రదానం ఆవశ్యకతను వివరిస్తున్నామన్నారు. కార్నియల్ అంధుల్లో చూపును నేత్రదాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా మాత్రమే చూపు వస్తుందన్నారు. వీరికి వేరొక ప్రత్యామ్నాయం లేదని, అందువల్ల ప్రజలందరూ నేత్రదానంపై అవగాహనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎవరైనా తమ కుటుంబంలో మరణిస్తే నేత్రదానానికి అంగీకరింపజేయించి సమాచారాన్ని నేత్ర సేకరణ కేంద్రానికి తెలియజేస్తే అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చని చెప్పారు. జిల్లాలో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారుల ద్వారా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో నేత్రదానంపై విస్తృతంగా అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

జగనన్న వదిలిన బాణం దాసన్న

పోలాకి : జగనన్న వదిలిన బాణం దాసన్న అని, ఆ బాటలోనే జిల్లాలో అన్ని సీట్లు వైసిపి ఖాతాలో పడడం ఖాయమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ జిల్లాలో వైసిపి జెండా రెపరెపలాడించిన చరిత్ర కృష్ణదాస్‌కు ఉందన్నారు. అందుకే ముచ్చటగా మూడోసారి జిల్లా అధ్యక్ష పదవి వరించిందని చెప్పారు. ఈ సందర్భంగా నరసన్నపేట వచ్చిన మంత్రి అప్పలరాజు కృష్ణదాస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిర్దేశించిన దారిలో కలిసికట్టుగా పనిచేసి జగనన్నను ముఖ్యమంత్రి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలాస నుంచి ఎంపికైన కార్యవర్గ సభ్యులు పాల్గొనగా, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, పలాస మండల అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టిబాబు), మందస ఎంపిపి డొక్కరి దానయ్య, పట్టణాధ్యక్షులు సనపల సింహాచలం ఉన్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

11న మూలపేటలో మహా ధర్నా

- **తీరప్రాంత భూములు కార్పొరేట్లకు ధారాదత్తం**
- **అఖిలపక్ష సమావేశంలో నాయకులు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


బలవంతపు భూసేకరణ, నిర్బంధాలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 11వ తేదీన మూలపేటలో మహా ధర్నా చేపట్టేందుకు అఖిలపక్ష నాయకులు నిర్ణయించారు. మూలపేట పోర్టు బలవంతపు భూసేకరణ, పోర్టు నిర్వాసితుల సమస్యలపై నగరంలోని ఎన్‌జిఒ హోంలో అఖిలపక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో తీర ప్రాంత భూములను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేందుకు పెద్దఎత్తున కుట్ర జరుగుతోందని విమర్శించారు. ముంపు ప్రాంతాల్లో నిర్వాసితుల కాలనీలు ఇవ్వడంలోనే ప్రభుత్వ డొల్లతనం కనబడుతోందని ఆక్షేపించారు. ఎటువంటి పునరుద్ధరణ కార్యాచరణ చేపట్టకుండా మూలపేట రైతుల పంటలను రౌడీమూకలతో ధ్వంసం చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. మూలపేట నిర్వాసితులకు మెరుగైన పునరావాసంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణానికి మూలపేట అంత అనుకూల ప్రదేశం కాదని, ఇది సాంకేతికపరమైన అంశాల్లో పలుమార్లు తేటతెల్లమైందన్నారు. ఏడాదిలో కొన్ని నెలల పాటు తీర ప్రాంతాల్లో వీస్తున్న గాలులకు ఇసుక అధిక మొత్తంలో మేటలు వేస్తుందని, ఈ పరిణామం పోర్టుకు ఎంతమాత్రం పనికిరాదని సెంట్రల్ వాటర్ రీసెర్చ్ కమిటీ 1993లో నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం నిర్వాసితుల ప్రాథమిక, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. జిరాయతీ భూముల తరహాలోనే అసైన్డ్ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి ముసుగులో వేలాది ఎకరాలను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచించాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈస్ట్‌కోస్ట్ భూములతో పాటు నిర్వాసితుల భూములను అదానీ భూములుగా మార్చుకునేందుకు కుట్ర సాగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా ఆరు వేల ఎకరాల భూములను అదానీ కంపెనీకి కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. తీరప్రాంత భూములపై అదానీ కన్నేశారని, మూలపేట పోర్టు విషయంలోనూ అదే జరుగుతోందన్నారు. అక్కడ జరుగుతున్నది అభివృద్ధి కాదని, విధ్వంసం మాత్రమేనన్నారు. సెప్టెంబరు 11న అఖిలపక్ష నాయకులు మూలపేటలో పర్యటించి నిర్వాసితులకు అండగా నిలుస్తామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ జిల్లా కార్యదర్శి సన్యాసిరావు, జనసేన పార్టీ నాయకులు కూర్మారావు, సంతబొమ్మాళి మాజీ ఎంపిపి జీరు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన పక్కా ప్రణాళికను రూపొందించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. పెద్దపాడులోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం చర్చించారు. అరసవల్లి మున్సిపల్ స్కూల్ పక్కన ఉన్న 2.77 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించారు. ఈ స్థలాన్ని కొన్నేళ్లుగా వృథాగా ఉంచారని, ఆక్రమణలకు గురికాకుండా ఈ భూమిని సంరక్షించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖ నుంచి ఈ భూమిని నగరపాలక సంస్థకు అప్పగింత పూర్తయిందని, ఈ స్థలంలో పలు నిర్మాణాలను చేపట్టేందుకు డిజైన్‌ను రూపొందించిన కన్సల్టెన్సీ ప్రతినిధులు వాటిని మంత్రి ధర్మానకు చూపించారు. నిర్మాణాలకు అవసరమైన మార్పులను సూచించారు. ఈ స్థలంలో ఓపెన్ థియేటర్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, యోగా థియేటర్, ఓపెన్ జిమ్ ఏర్పాటుతోపాటు పక్కనే ఉన్న చెరువును కూడా అభివద్ధి చేయాలని మంత్రి ధర్మాన సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక తయారు చేయాలని నగరపాలక సంస్థ అధికార్లకు ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ ఇంజినీర్ గంగాధర్, వైసిపి నాయకులు చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

కొండను మింగేస్తున్నా పట్టించుకోరా?

- **రోడ్లు, కాలువలను ఎప్పుడు బాగు చేస్తారు?**
- **స్పీకర్‌ను నిలదీసిన దల్లిపేట గ్రామస్తులు**



స్పీకర్‌కు సమస్యలు చెప్తున్న మాజీ సర్పంచ్ రఘురాంరెడ్డి

ప్రజాశక్తి - పొందూరు

కొండను మింగేస్తున్నా పట్టించుకోరా?, గ్రామంలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందంటూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను దల్లిపేట గ్రామస్తులు ప్రశ్నించారు. మండలంలోని దల్లిపేటలో సర్పంచ్ కంబాపు నీలవేణి ఆధ్వర్యాన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బడే రఘురాంరెడ్డి ఆధ్వర్యాన గ్రామానికి చెందిన సుమారు వంద మంది స్పీకర్‌ను కలిశారు. గ్రామం సమీపంలోని కొండను కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. గత ఎన్నికల్లో తామంతా వైసిపికే ఓటు వేశామని కానీ, ఎటువంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. ఇప్పటికైనా గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పీకర్ మాట్లాడుతూ గ్రామ సమస్యలు తనకు తెలుసునని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

మండలంలోని రాపాకలో అర్హులైన లబ్ధిదారులకు అనువైన స్థలాల్లో ఇళ్ల పట్టాలను అందజేయనున్నట్లు స్పీకర్ తెలిపారు. జలజీవన్ మిషన్‌లో రాపాకలో రూ.మూడు కోట్లతో, తోలాపిలో రూ.1.60 కోట్లతో, తాడివలసలో రూ.1.40 కోట్లతో ఇంటింటా కుళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, కంబాపు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, శ్రీకాకుళం.
OS NO. 233/2020

BETWEEN:
Belgam Laxmi .... Plaintiff
AND
Potnuru Savitramma (died) & Others ....Defendants

To
Potnuru Suryarao, S/o Late Appa Rao, R/o MIG-325, APHB Colony, Opp: Zilla Parisad Srikakulam Town & District (D2)

NOTICE

పై దావా లో మీరు 2వ ప్రతివాది అయివున్నారు. సదరు దావా తే 31.08.2023 దిన మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయంగా గాని, లేదా లాయర్ గారు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట వాయిదా నాడు ఉదయం గం॥ 10.30 ని॥ లకు పై తేది నాడు హాజరై మీకు గల ఆక్షేపణలు శ్రీ వారి కోర్టు ఎదుట తెలియజేసుకోవలెను, లేని యెడల సదరు పిటీషన్ విషయమై మీరు పరోక్షంగా విచారించి తీర్మాణం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ధవళ విజయలక్ష్మి
దావాల ప్రవల్లిక, అడ్వకేట్స్,
ధవళకాలనీ, జి.టి.రోడ్, శ్రీకాకుళం.
సెల్ :9440683517, 9154279357

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి దివ్య సముఖమునకు
SOP. 11/2023

Between:
1.చోడిపిల్లి పద్మావతి, భర్త : లేటు మధనబాబు, వయస్సు: 39 సంవత్సరాలు, నివాసము: 6-75/5, మెయిన్ వీధి, మెయిన్ రోడ్, కాలనీ, బందరువానిపేట గ్రామము, గార మండలం, శ్రీకాకుళం జిల్లా.
2.చోడిపిల్లి ఇందు. (పిటిషనర్ నెంబర్2 మైనర్ కావున, ఆమె సంరక్షకురాలు తల్లి చోడిపిల్లి పద్మావతి/ పిటిషనర్ నెంబర్1) **--పిటిషనర్స్**
మరియు:
NIL --రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్స్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్ లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 27-9-2023 ఉ॥ 10: 30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను. లేనియడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

డి.టి. మణి చందన్
బి.ఎ.ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎమ్
అడ్వకేట్, అరసవిల్లి, శ్రీకాకుళం
సెల్ : 8919146438.


చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

స్వచ్ఛ పరిశుభ్రతపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్య దష్ట్యా ప్రవేశపెట్టిన స్వచ్ఛ పరిశుభ్రతపై అలసత్వం వహిస్తున్నారని స్వచ్ఛ సర్వే రక్ష గ్రామ సర్వే టీం కేంద్ర ఎన్యూమరేటర్ జి. మనోజ్ కుమార్ అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండల కేంద్రంలోని వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, దేవాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు బృంద సభ్యులు పరిశీలించి అములు, తీరు, తెన్నులు తెలుసుకున్నారు. స్థానిక 35 పడకల సామాజిక ఆసుపత్రిలో డస్ట్ బిన్నులు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని వినియోగించడంలో ఆసుపత్రి సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని ఆసహనం వ్యక్తం చేశారు. ప్రజలు డస్ట్ బిన్నులు ఉన్నప్పటికీ వినియోగించకుండా నేరుగా సిరంజీను డస్ట్ బిన్‌లో వేయటం సరికాదని హెచ్చరించారు. అనంతరం స్థానిక కొత్త ముద్దల దేవాలయం పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రకాష్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిపిఆర్సిలు బి. గోవిందరావు, పి.వెాజెన్ ప్రసాద్, ఐఇసి అరిడ్యూవెస్ జిల్లా సమన్వయకర్త కె. అమ్మాజీరావు, ఇఒపిఆర్డి రాజారావు, పంచాయతీ ఇఒ చింతాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

మహిళల ఆర్థిక బలోపేతంతోనే అభివృద్ధి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మహిళలు బలమైనప్పుడే ఉండి, ఆర్థికంగా రాణిస్తేనే, కుటుంబ అభివృద్ధితోపాటు, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం అక్కివరం పంచాయతీ గోపీనగర్ పరిధిలోని మనస్వపేటలో మండల సమాఖ్య కోశాధికారి రేణుకా అధ్యక్షతన నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా రైతు కుటుంబం కూడా పెరటి తోటలు వేసి అందులో ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా ఆకుకూరలు, కాయగూరలతో పాటు మునగ, కరివేపాకు, బొప్పాయి, జామ మొదలగు చెట్లను పెంచుకోవాలని సూచించారు. గ్రామాలలో మహిళలందరికీ అవగాహన కల్పించి, అందరి ఆరోగ్యానికి అవసరమైన చిరుధాన్యాలు ఉత్పత్తి ప్రణాళికలు తయారు చేసుకొని రాగులు, జొన్నలు, గంటెలు, సామలు, ఊదలు మొదలగు విత్తనాలను సమకూర్చుకొని పండించాలని కోరారు. రైతు సంఘాలకు చిరుధాన్యాలు, తోట పంటల ఉత్పాదకతకు అవసరమైన పనిముట్లు, పెట్టుబడి సహాయానికి మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధీనంలో బ్యాంకుల ద్వారా అవసరమైన రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు . ఈ కార్యక్రమంలో పద్మ, కుమారి, వి.వో.ఎ. రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున హుదూద్ గృహాలు

అక్రమ కంకర తవ్వకాల ఫలితమే!

ప్రజాశక్తి - పలాస

టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన హుదూద్ గృహ సముదాయం ప్రమాద అంచున ఉంది. ఏ క్షణానైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉండటంతో సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. గృహ సముదాయం అంచున వరకూ అక్రమంగా కంకర తవ్వకాలు చేపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 198 హుదూద్ గృహాలు టిడిపి ప్రభుత్వంలో హయాంలో నిర్మించారు. 2014లో సంభవించిన హుదూద్ తుపాను ధాటికి భవనాలు, పూరి గుడిసెలు నేల మట్టమయ్యాయి. దీంతో ప్రభుత్వం పేదల కోసం నెమలికొండ, ఇండస్ట్రియల్ ఏరియా మధ్యలో 198 గృహాలు మంజూరు చేసింది. ఒక్కో గృహానికి రూ.4.03 లక్షలు చొప్పున హుదూద్ గృహాలను నిర్మించారు. లబ్ధిదారుల ఎంపిక చేసి అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన గృహాలను అప్పగించలేకపోయారు. వైసిపి నాయకులు తాము అధికారంలోకి రాగానే గృహాలు పంపిణీ చేస్తామని, గతంలో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ప్రగల్భాలు పలికినా నేటికి వాటిని పంపిణీ చేయలేకపోయారు. ప్రస్తుతం ఆ గృహ సముదాయం రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో నలిగి శిథిలావస్థకు చేరుకుంది. రూ.కోట్లు విలువైన ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు.

ఇష్టానుసారంగా...

ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపడుతున్న అధ్యక్షానికి వారు లేకపోవడంతో కంకర మాఫియాగా మారిపోయింది. రూ.కోట్లు విలువ చేసే కంకర తరలిపోతుంది. వాస్తవానికి కంకర తవ్వకాలు చేపట్టే ముందు రెవెన్యూ, మైన్స్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కంకర మాఫియాకు అటువంటి అనుమతులు అవసరంలేదు. పాలకులు, రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం తూతూమంత్రంగా పరిశీలించి తమకేమీ సంబంధం లేనట్లు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


గృహాల సమీపంలో తవ్విన కంకర

ఆ ప్రాంతంలో 33/11 కెవి విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల పక్కన పూర్తిగా కంకర తవ్వడంతో స్తంభాలు సైతం కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో సమీప ప్రజలు, జీడి వర్క్ శ్రమల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో రెండు ఎకరాలకు పైగా అక్రమంగా కంకరను తవ్వినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ కంకర తవ్వకాలు అరికట్టడంతో పాటు హుదూద్ గృహ సముదాయానికి ఇబ్బందులు లేకుండా గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పులి సంచారంతో బిక్కుబిక్కున గిరిజనులు

ప్రజాశక్తి - బూర్జ

తమ గ్రామ సమీపంలోనే పులి సంచరిస్తుండడంతో గిరిజనులకు కంటిపై కునుకు కరువైంది. ఎల్ఎన్‌పేట మండలం గిరిజన గ్రామాల సమీప కొండల్లో పులి సంచరిస్తుంది. దీంతో బూర్జ మండలంలోని సోమదాలవలస, బూర్జమానుగూడ, మునసబుపేట తదితర గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు గురువారం రాత్రికి తమ సమీపంలో కొండల వద్ద పులి సంచరిస్తుండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. గ్రామాల చుట్టూ దట్టమైన అడవులు ఉండడంతో పులి సంచారానికి అనువుగా ఉంటుంది.

జాడ లేని అధికారులు

తమ సమీపంలోని కొండల్లో పులి సంచరిస్తున్నా...


బూర్జమానుగూడ గిరిజనులు

అటవీశాఖ అధికారుల జాడ ఇంతవరకు కనిపించలేదని గిరిజనులు తెలిపారు. పులి తమ ప్రాంతంలో సంచరించినప్పుడు తాము ఎలా మెసులుకోవాలో అవగాహన కల్పించాల్సిన అధికారులు కనీసం తమ గ్రామం వైపు చూడకపోవడం శోచనీయమని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పులి జాడను తెలియజేసి పులి నుంచి తమకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

భయం వేస్తోంది



పులి తమ సమీప కొండల్లోనూ సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయమేస్తుంది. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉన్నాం. పగటి పూట పనులకు వెళ్లడానికి భయపడుతున్నాం. చిన్నారులను పట్టుకుని కాలం వెళ్లదీస్తున్నాం. - సవర ప్రసాద్

అధికారుల జాడ లేదు



గ్రామానికి సమీపంలో పులి సంచరిస్తుంది. అటవీ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా, వారి జాడ లేదు. పిల్లా పాపలతో క్షణం క్షణం భయంతో గడుపుతున్నాం. - సవర సుక్కమ్మ


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

అవకాశాలు వినియోగించుకోవాలి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

పలాస : వైసిపి సీనియర్ నాయకులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో పార్టీ అభివద్ధికి కషి చేయాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వైసీపీ అధిష్టానం నియమించిన జిల్లా కార్యవర్గంలో పలాస నియోజకవర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు బడగల బల్లయ్య (ప్రధాన కార్యదర్శి), దున్న సత్యం, తామాడ సరస్వతి, కుర గౌడ్, దేవరకొండ షణ్ముఖరావు (ఎగ్జిక్యూటివ్ సభ్యులు)లను, కార్యదర్శిగా దల్లి జానకిరావు, ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షులుగా బెల్లాల శ్రీనివాసరావు, సాంస్కతిక విభాగపు అధ్యక్షులుగా ఉప్పరపల్లి ఉదయ్ కుమార్‌కు స్థానం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రగతి భవన్ లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సీనియర్ నాయకులకు పార్టీ గురుతర బాధ్యతలను అప్పగించిందని, పార్టీలో కొత్త వారిని కలుపుకొని ముందుకు వెళ్లాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి పదవులు రావని, కష్టపడే తత్వం ఉన్నవారికి అవి వరిస్తాయని అన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి 17 వేల పైచిలుకు ఓట్లతో ఓటమి పాలయ్యారని, 2019లో జరిగిన ఎన్నికల్లో తాను సుమారు 17 వేల ఓట్లతో విజయం సాధించడం వెనుక పార్టీ కార్యకర్తల కషి ఎంతో ఉందన్నారు. పలాస నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని, గతంలో జిల్లా కార్యవర్గంలో పని చేసిన నాయకులకు పదవులు రాలేదని నిరాశ చెందాల్సిన అవసరం లేదని, భవిష్యత్లో మరెన్ని పదవులు వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు అందరం కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసీపీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరరావు

కేంద్రమంత్రికి 'ఎన్ఇఆర్' స్వాగతం

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం మెంటాడ మండలం చినమేడపల్లిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవతో కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.834 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఆయనతోపాటు రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల హరనాథ్, కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

28, 29న వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి - పోలాకి

ఈ నెల 28,29 తేదీల్లో ఎపి మోడల్ స్కూల్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ ముద్దాడ విజయ వెంకట అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28వ తేదీన రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కష్ణదాస్ చేతులు మీదుగా ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలుగా విభజనతో పోటీలుంటాయని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతుల తోపాటు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు 8008282009 సెల్ నంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎరువుల పంపిణీ


వెంకటరావు చిట్టి

పలాస : ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగంచేసుకోవాలని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. పలాస పిఎసిఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో భాగంగా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని, శనివారం ఉదయం 9 గంటల నుంచి బ్రాహ్మణతర్ల పిఎసిఎస్ గిడ్డంగి వద్ద పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం రైతు భరోసా కేంద్రం ద్వారా ఇరువురు పంపిణీ చేస్తామని అన్నారు. ఒకవేళ రైతు భరోసా కేంద్రాల వద్ద ఎరువులు లభ్యం కానీ ఎడలా రైతులు తమ ఆధార్ కార్డు తీసుకువస్తే బయోమెట్రిక్ విధానం ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఒక రైతుకు రెండు బస్తాలు అందజేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కవి సమ్మేళనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహాకవి గిడుగు రామమూర్తి పంతులు 160 జయంతి సందర్భంగా మాతభాషా దినోత్సవ కార్యక్రమం శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 27న ఉదయం 9 గంటలకు నిర్వహిసనున్నట్లు శ్రీకాకుళం వేమన కవితా నిలయం అధ్యక్షులు మహ్మద్ రఫీ, కార్యదర్శి బుర్రి కుమార్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతభాష కోసం అవిరళ కషి చేసిన గిడుగు రాంమూర్తిని శ్రీకాకుళం జిల్లా కవులందరూ తమ తల్లిభాష తెలుగు విలువలు తెలిపే కవితలతో గిడుగువారికి స్మరించుకోవాలని తెలిపారు. ఆసక్తి గల కవులు ముందుగా తమ పేర్లను ఈ వేమన సెల్ 7893451307 నెంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శేషగిరి

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

సోంపేట: మండలంలోని చిన్నమామిడిపల్లిలో నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి సర్పంచ్ పాతిన శేషగిరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్‌షెల్టర్ నిర్మాణానికి పంచాయతీ నిధులు కేటాయించామని తెలిపారు. దీంతో కొన్నేళ్ల ప్రయాణికుల కళ నెరవేరిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి దున్న మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ స్తంభాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - రణస్థలం

మండల కేంద్రం జె.ఆర్.పురం ఎంపియుపి పాఠశాలకు ఎదురుగా ఉన్న రెవెన్యూ సర్వే నంబరు 2/1 ఉన్న 13 సెంట్లు వివాదాస్పద స్థలం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. అయితే ఆ స్థలం గ్రామకంఠంగా నిర్ధారించినందున రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని రక్షించే బాధ్యత మీదేనంటూ జె.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలియజేస్తూ రెవెన్యూ అధికారులు బుధవారం నోటీసులు అందజేశారు. అయితే ఆక్రమదారుడు పిన్నింటి సత్యనాయుడు శుక్రవారం కాపువిధీ, పాఠశాల వద్ద ప్రజలు రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ సిమెంట్ స్తంభాలు పాతించారు. దీంతో ఈ స్తంభాలను తొలగించాలని కార్యదర్శి ఆదినారాయణకు స్థానికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయంగా ఉన్న సిమెంట్ స్తంభాలు తొలగించాలని డిమాండ్ చేశారు. తక్షణమే తొలగించకపోతే ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు


సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తిలక్

ప్రజాశక్తి - నందిగాం

గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్టు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని గొల్లూరు పంచాయతీ పరిధిలోని సొంటినూరులో మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామాలన్నీ అభివద్ధిపథంలో పయనిస్తున్నాయని అన్నారు. గిరిజన సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకుని ప్రతి ఒక్కరు ఆర్థికాభివద్ధి సాధించడంతోపాటు గ్రామాలను అభివద్ధి చేసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నట్టు తెలిపారు..ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు సైలాడ లావణ్య ,అంబోడి విష్ణు, నంది గాం మండల యువజన నాయకులు జీరు లక్ష్మణ రెడ్డి, రట్టి నాగరాజు, సర్పంచులు మడపాల సంజీవరావు, బొమ్మాళి గున్నయ్య, తమిరి దేవేందర్, వైఎస్ఆర్‌సిపి నాయకులు గిరిజన మహిళలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విధేయులకు పట్టం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వైసిపికి విధేయతతో పనిచేసిన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస రావుకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించిందని మంత్రి అప్పలరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయంలో మంత్రితోపాటు నియోజకవర్గం వైఎస్సార్సీపీ నాయకులు శ్రీనివాస్‌కు శాలువా పుష్పగుచ్ఛం తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచిన మంత్రులు అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉంగా సాయికృష్ణ, పాలిన ఉమామహేశ్వర రావు, సర్పంచ్‌లు కొల్లి భాస్కర్ రావు,చింత రాజు,మాజీ ఎంపీటీసీ ఉప్పిలి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి అప్పలరాజు

కొత్తూరు : వైఎస్ఆర్‌సిపి జిల్లా కోశాధికారిగా లోతుగెడ్డ.తులసి వరప్రసాద రావు నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం వై.సి.పి. పాతపట్నం నియోజకవర్గ నాయకులుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎం.పి.టి.సి.గా గెలుపొంది వైస్ ఎం.పి.పి.గా పని.చేస్తున్నారు. ఈయన.ఎంపికపై వై.సి.పి. నాయకులు.లోతుగెడ్డ శ్రీరామ్ దూత, రేంగేటి కన్నయ్య, కోయిలాపు సంజీవరావు, లోతుగెడ్డ లక్మి.నారాయణ, పడాల వెంకట కష్ణ తదితరులున్నారు.

దృఢత్వంలో రారాజు హీరో గ్లామర్


బైక్‌ను ప్రారంభిస్తున్న ఎఎస్‌పి విఠలేశ్వరరావు

ఎఎస్‌పి విఠలేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సరికొత్త నూతన ఫీచర్స్‌తో ధృడత్వంలో హీరో గ్లామర్ అని ఎఎస్పి టి.పి.విఠలేశ్వరరావు అన్నారు. నగరంలోని వరం ఆటో సెంటర్‌లో శుక్రవారం గ్లామర్ పరిచయ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని నడిపి పరిచయం చేశారు. అనంతరం వరం ఆటో సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ అంధవరపు ప్రసాదరావుతో కలిసి ఆయన కేక్‌ను కట్ చేశారు. ప్రథమ వాహన కోనుగోలుదారులకు గ్లామర్ ద్విచక్ర వాహన నమూనా తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమ్మకంతో వాహనదారుల ఆలోచనలకు అనుగుణంగా తయారు చేయబడిన గ్లామర్ వాహనం కొనుగోలు పెరగాలని కోరారు. డైరెక్టర్ మాట్లాడుతూ పాత జనరేషన్‌తో పోల్చి, డిజైన్ పరంగా చూసుకుంటే.. హీరో గ్లామర్ బైక్‌లో నూతన అప్‌గ్రేడ్ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సరికొత్త గ్లామర్ సింప్లి మాగ్నెటిక్ రూపంలో మార్కెట్లోకి విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంధవరపు శంకరరావు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి గంగుల రమణబాబు, వెటర్నరీ సర్జన్ డాక్టర్ గురుగుబెల్లి సుభాష్‌చంద్రబోస్, వరం ఆటో సెంటర్ సేల్స్ మేనేజర్ మొదలవలస శ్రీనివాసరావు, అకౌంట్స్ మేనేజర్ వెంకటరావు, సత్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి చక్రవర్తి మల్లా

నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - పలాస

సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, జరిగిన ఘటనలపై పోలీసు, న్యాయస్థానం దృష్టికి తీసుకురావాలని పలాస సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి చక్రవర్తి మల్లా అన్నారు. పలాస జూనియర్ కళాశాల, పలాస మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థులు, మెప్మా ఆర్పిలతో పలాస మండల న్యాయ సేవా సంఘం, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన ఘటనలను ధైర్యంగా న్యాయస్థానం దృష్టికి తీసుకురావాలన్నారు. మంచి ప్రవర్తనతో మెలగాలని, చెడు వ్యసనాల వైపు వెళ్ళవద్దని విద్యార్థులకు హితవు పలికారు. సెప్టెంబరు 9న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిపి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి. వెంకట రావు, ఉపాధ్యక్షులు ఘని, అనిల్ రాజ్, కొమర దేవ రాజు, కోత. రజని కుమార్, చంద్రశేఖర్, శ్యామ్, సూపరిండెంట్ ఫాణిగ్రహి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎల్.మధుసూదన రావు, ప్రభాకర్, విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ వెంకట మోహన్, ఎస్సై షేక్ వలి కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పనులు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ

సంతబొమ్మాళి : మండలంలోని శుక్రవారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి బోరుభద్ర పెద్ద చెరువు సమీపంలో 33 కేవి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సిబ్బంది స్పందించి క్రేన్ సహాయంతో విద్యుత్ స్తంభాలను లేపి యుద్ధపాత్రిపదికన పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కార్యక్రమంలో డిఇ రాజశేఖర్, ఎఇ ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

రేపు మాతృభాషా దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : మహాకవి గిడుగు రాంమూర్తి పంతులు 160 జయంతిని ఈ నెల 27న నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవేమన కవితా నిలయం అధ్యక్షులు మహ్మద్ రఫీ, కార్యదర్శి బుర్రి కుమార్ రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. మాతృభాష కోసం అవిరళ కృషి చేసిన గిడుగును శ్రీకాకుళం జిల్లా కవులందరూ తమ తల్లిభాష తెలుగు విలువలు తెలిపే కవితలతో గిడుగువారికి స్మరించుకోవాలన్నారు. ఆశక్తి ఉన్న కవులు ముందుగా తమ పేర్లను ఈ వేమన సెల్ 7893451307 నంబరులో నమోదు చేసుకోవాలన్నారు.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ

ఇచ్ఛాపురం : విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్ పాడి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ ఓరియంటల్ శిక్షణ కార్యక్రమా న్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ 30 రోజుల పాటు ట్రైనర్ చిన్మయి సాహు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కమిషనరేట్ ఆఫ్ కేలిజియట్‌లో భాగంగా ట్రైనింగ్ ప్లే రోల్, కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, రేసుమ్ రైటింగ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని అన్నారు. ఈ శిక్షణలో జాబ్ ఓరియెంటెడ్, తరువాత క్యాంపస్‌లో ఉద్యోగాలు కల్పించే విధంగా ఉపయోగప డుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుశాంత్ జెన్న, సంతోషకుమార్, లోకేశ్వరరావు, దుర్యోధన, శివకుమార్ పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్ పాడి


కళ్యాణి మృతదేహం
(ఇన్‌సెట్‌లో కళ్యాణి ఫైల్)



రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని సరియాపల్లి పాత జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస శివాజీనగర్ కు చెందిన ఇప్పిలి కళ్యాణి (20) అక్కడికక్కడే మృతి చెందింది. కాశీబుగ్గ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కళ్యాణి ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ నుంచి బెండిగేటు వైపు స్కూటీపై వెళ్తుంది. ముందు వెళ్తున్న కారును తప్పించి అతి వేగంతో విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ముందు భాగాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృత్యువాత పడింది. మృతురాలు ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఫిజియోథెరపీ విభాగంలో పని చేస్తుంది. అలాగే ఇంటి వద్ద కూడా ఫిజియోథెరపీ చేస్తుంది. ఇటీవల స్కూటీ కొనుగోలు చేసిందని, ఇంతలో ఈ ప్రమాదం సంభవించిందని తల్లిదండ్రులు తండ్రి బాలరాజు, తల్లి పుణ్యవతి, అన్నయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి జీడి పరిశ్రమలో పని చేస్తుండగా, తల్లి గృహిణి. అన్నయ్య ఐటిఐ చదువుతున్నాడు. రెక్కాడితే గానీ డొక్కా నిండని కుటుంబం వారిది. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ తన వంతుగా ఆర్థికంగా అందుకుంటున్న సమయంలో కళ్యాణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కళ్యాణి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు, ఆర్‌టిసి డిపో మేనేజర్ రోణంకి సీతారాంనాయుడు, సంతోష్‌కుమార్, ఎన్.వెంకటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గల కారణాలను స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడి ఉండేదని పోలీసులు అంటున్నారు. అందుకే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని కనిమెట్ట సమీపంలోని పంట కాలువలో పడి ఎచ్చెర్ల మండలం చిన్నపూడివలసకు చెందిన గొలివి రమణ (27) మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యువకుడికి మద్యం అలవాటు ఉంది. గురువారం సాయంత్రం కనిమెట్ట వద్ద మద్యం దుకాణం వద్ద మద్యం తాగాడు. గ్రామానికి నడుచుకుంటూ వస్తుండగా మద్యం ఎక్కువై మత్తులో రహదారి పక్కన గల పంట కాలువలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక చనిపోయాడు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, ఎఎస్ఐ రామచంద్రరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శుక్రవారం బయటకు తీశారు. మృతుడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడని, మద్యం అలవాటు ఎక్కువుగా ఉందని తండ్రి గన్నెయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎన్‌ఛార్జి ఎస్ఐ రఘునాథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని...

పలాస : పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి కవిటి మండలం ఖజూర్ రైల్వేగేటు వద్ద శుక్రవారం రైలు ఢీకొని 50 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడా? రైలు ఢీకొని మృతి చెందాడా? అనే విషయం తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులకు వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

1న సిపిఎస్ ఉద్యోగుల ధర్మ పోరాటం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందుకు తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాటు సిపిఎస్‌పై దాటవేత ధోరణి అవలంబించారని ఎపి సిపిఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి భాస్కరరావులు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్ల తర్వాత సిపిఎస్ ఉద్యోగులకు తీపికబురు రంటూ ఉద్యోగులకు మరోమారు అన్యాయం చేసేందుకు సిద్ధపడ్డారని అన్నారు. ఉద్యోగుల పొట్ట కొట్టి, దగా చేసేందుకు ఆశాస్త్రీయ పద్ధతిలో జిపిఎస్‌గా పేరు మార్చి చూపుతున్నారన్నారు. జిపిఎస్ విధివిధానాలపై కనీసం ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఆర్డినెన్స్ కోసం గవర్నర్‌కు పంపించి దాన్ని ఏకపక్షంగా చట్టం చేయాలని చూడటం సరికాదన్నారు. సిపిఎస్ ఉద్యోగుల పాలిట చీకటి దినమైన సెప్టెంబరు 1న కలెక్టరేట్ వద్ద దగా పడ్డ సిపిఎస్ ఉద్యోగుల ధర్మ పోరాట నిరసన చేపడతామన్నారు. సిపిఎస్ ఉద్యోగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటుకు శనివారం నుంచి మంగళవారం వరకు ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కాశీబుగ్గ విద్యుత్ శాఖ డిఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గలో నిత్య నగర్, ఆంధ్ర బ్యాంక్ రోడ్డు, గాంధీనగర్, న్యూ కాలనీ, దుర్గ మండపం పోలీస్ స్టేషన్ ఏరియా, కాశీబుగ్గ హై స్కూల్ ఏరియా, ఎస్ఎండీ పార్లర్ ఏరియా, ఫిష్ మార్కెట్, తిలక నగర్, డిగ్రీ కళాశాల రోడ్, పూజారి వీధి, గుణేశ్వర నగర్, న్యూ కాలనీ, హరి శంకర్ సినిమా హాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. సమస్యను దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

పంట నమోదు వేగవంతం

మెళియాపుట్టి: మండలంలో ప్రస్తుతం ఖరీఫ్ 2023 కాలంలో పండిస్తున్న ప్రతిఒక్క రైతు పంటనూ నమోదు చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి.భవానీశంకర్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ పి.సరోజని మాట్లాడుతూ విఎఎలు, విఆర్‌ఒలు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అమలవుతాయని అన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు, పంట నష్టపరిహారం, పంట బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు వర్తిస్తాయన్నారు.

భయపెడుతున్న విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట నుంచి చీమలవలస వైపు వెళ్లే మంగళవాని చెరువుకు మధ్య రహదారికి ఒకవైపున ఉండే విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇదే రహదారిపై ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రోజూ కొన్ని వందల మంది రాకపోకలు కొనసాగిస్తున్నామని, ఏ సమయంలో విద్యుత్ స్తంభాలు కూలుతాయోనని బిక్కు,బిక్కు మంటూ ప్రయాణాలు కొనసాగిస్తున్నామని పలువురు వాపోతున్నారు. చాలావరకు స్తంభాలు ఒక వైపునకు ఒరిగి ఉన్నాయని, ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం

పొలం గట్లపై కూరగాయల సాగు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి పంట పొలాల గట్లపై పలు రకాల కూరగాయలను సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి తెలిపారు. శుక్రవారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో వరి సాగు చేస్తున్న పొలం గట్లపై రైతులు కూరగాయలు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిజిటల్ ఎల్ 1 సురేష్ మాట్లాడుతూ గట్లు పై బహుళ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు ప్రకతి సేద్యంలో స్వచ్ఛమైన కూరగాయలు లభించడంతోపాటు అదనపు ఆదాయాన్ని కూడా పొందుతారని అన్నారు. రైతులకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి పంటల్లో మెరుగైన ప్రకతి వ్యవసాయ పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అధిక దిగుబడులు వచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కష్ణవేణి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న చిరంజీవి

'వై నాట్ ఒపిఎస్'ని విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సోంపేట: జిపిఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న విజయవాడలో ఏపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యాన చేపట్టనున్న 'వై నాట్ ఒపిఎస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిపిఎస్‌ను బలవంతంగా ఉద్యోగులపై రుద్దడానికి దొడ్డిదారిన ఆర్డినెన్స్ తీసుకురావడానికి జగనన్న వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏపిసిపిఎస్ఇఎ వ్యవస్థాపక సభ్యులు బోకర బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి సూరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ మెండ రామారావు, సోంపేట మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కురమాన నారాయణరావు, దాలిబందు, శ్రీను, కిరణ్, అప్పారావు, జయరామ్, శోభన్, లోకేష్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న విఠలేశ్వరరావు

శాంతిభద్రతలను పరిరక్షించాలి

ఎస్‌పి విఠలేశ్వరరావు

ప్రజాశక్తి- బూర్జ

శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్‌పి పి.విఠలేశ్వరరావు ఆదేశించారు. బూర్జ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఇక్కడ క్రైమ్ పరిస్థితి గురించి ఎస్ఐ అశోక్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతి రెండు నెలలకొకసారి స్టేషన్‌ను సందర్శించి సమీక్షిస్తానని తెలిపారు. ప్రజలతో పోలీసులు సోదర భావంతో మెలగాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి క్రైమ్ రేట్‌ను పూర్తిగా తగ్గించాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి రక్షణ కల్పించాలన్నారు.

బి.పి మండల్ సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం అర్బన్ : బిసిల అభ్యున్నతికి బి.పి.మండల్ చేసిన కృషి మరువలేనిదని, ఆయన సేవలు చిరస్మరణీయమని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు అన్నారు. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో మండల్ 125వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కలగ జగదీష్, ఆయన కుమార్తె కలగ లిజీ యాదవ్, కంఠ వేణు, మూల నారాయణరావు, కాయితీ వెంకటరమణ, గద్దెబోయన కృష్ణ, కర్రీ రంగాజీదేవ్, దామోదర కేశవ, తిప్పాన గాంధీ, పేరూరి శ్రీనివాసరావు, ఇప్పిలి చిన్నారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ పాటుపడ్డారని ఒబిసి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం బిపి మండల్ 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన సేవలు అనుసరణీయమని అన్నారు. బిసి కమిషన్‌కు చైర్మన్‌గా ఉంటూ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ శివ, వాసు, అన్నెపు రమేష్, లఖినేని సునీల్, శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.